గజ్వేల్ అర్బన్ : మార్కండేయ జయంతిలో పాల్గొన్న ప్రతాప్‌రెడ్డి, ఎన్సీ రాజమౌళి

ఘనంగా మార్కండేయ జయంతి

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 12 : గజ్వేల్ పట్టణంలో మార్కండేయ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మార్కండేయ ఆలయం నుంచి స్వామివారి ఉత్సవ మూర్తిని ఇందిరా పార్కు మీదుగా తిరిగి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, శివపంచాక్షరీ జపం, మృత్యుంజయ మంత్ర జపం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు రాజారాం, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు తలకొక్కుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

దుబ్బాక టౌన్‌లో..

దుబ్బాక టౌన్, ఫిబ్రవరి 12: పద్మశాలీల కుల దైవమైన మార్కండేయ జయంతిని దుబ్బాకలో పద్మశాలీ సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గాజుల తిరుపతి దంపతులతోపాటు కుల పెద్దలు, యువజన సంఘాల నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితభూంరెడ్డి దంపతులు పూజలు చేశారు. ఆలయంలో యజ్ఞం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పల్లకీ ఊరేగింపులో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

సాంద్రానంద ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

ఎమ్మెల్యే వివేకానందకు ఆశీర్వచనాలు అందజేస్తున్న ఆశ్రమ నిర్వాహకుడు శ్రీనాథశర్మ

కొమురవెల్లి, ఫిబ్రవరి 12 : మండలంలోని మల్లికార్జున స్వామి సాంద్రానంద ఆశ్రమం లో నృసింహస్వామి వార్షికోత్సవంలో భాగం గా సోమవారం ఆశ్రమ నిర్వాహకుడు గౌరిభట్ల శ్రీనాథశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ శేషుశర్మ వైదిక నిర్వహణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను ఆశ్రమ నిర్వాహకులు శాలువాతో సత్కరించారు.

బడ్జెట్‌లో దివ్యాంగులకు మొండి చెయ్యి

సిద్దిపేట పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 12: బడ్జెట్‌లో ప్రభుత్వం దివ్యాంగులకు మొండి చెయ్యి చూపిందని డీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు దండు శంకర్ ఆరోపించారు. దివ్యాంగులకు బడ్జెట్‌లో నిధులు కేటాంచకపోవడాన్ని నిరసిస్తూ సిద్దిపేట పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు దివ్యాంగుల సంక్షేమం గురించి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. మమ్మల్ని మర్చిపోతే దివ్యాంగులకు ఓటు ఉందనే విషయాన్ని మరువొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంపత్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి నారాయణ, సభ్యులు చందనగిరి రాజు, యాకూబ్, రమేశ్, రాజేశ్, నర్సింహులు, సువర్ణ, లక్ష్మి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ శ్రీధర్

గజ్వేల్‌అర్బన్, ఫిబ్రవరి 12: గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో రోడ్డుప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత నిర్వహించిన సమావేశానికి ప్రొఫెసర్ మీలా శ్రీధర్ హాజరై ప్రసంగించారు. రోజూ నిమిషానికి ఒకరు చొప్పున రోడ్డు ప్రమాదాలకు గురై మరణిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో 50 శాతం యువతనే ఉన్నారన్నారు. వాహనం నడిపేటప్పుడు ఫోన్‌లో మాట్లాడవద్దని, హెల్మెట్ ధరించకుండా, సీట్‌బెల్ట్ లేకుండా డ్రైవింగ్ చేయొద్దని కోరారు. రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి ప్రథమ చికిత్స అందించి 108కు సమాచారం అందించడం ప్రథమ కర్తవ్యంగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ గణపతి, అకాడమిక్ కోఆర్డినేటర్ బాలరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు, విజయభాస్కర్, రామచంద్రం, డాక్టర్ పెద్దిరాజు, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ లెఫ్టినెంట్ డాక్టర్ భవాని, మార్కండేయ పాల్గొన్నారు.

'కూడవెల్లి' హుండీ ఆదాయం
రూ.2.70 లక్షలు

దుబ్బాక, ఫిబ్రవరి 12: కూడవెల్లి జాతర ముగిసింది. మాఘ అమావ్యాస సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలతోపాటు నాలుగు రోజులు జాతర కొనసాగింది. ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. దేవాలయ కార్యనిర్వాహణాధికారి విశ్వనాథశర్మ నేతృత్వంలో హుండీ లెక్కించగా రూ.2.70 లక్షలు వచ్చాయని తెలిపారు. జాతర సందర్భంగా లడ్డు, ప్రసాదం, కొబ్బరికాయలు తదితర వేలంపాటలో రూ.4.46 లక్షలు వచ్చాయన్నారు. జాతర ప్రశాంతంగా ముగిసినందుకు ఆలయ అర్చకులు, అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

నల్లగొండ సభను
జయప్రదం చేయాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 12 : కృష్ణానది ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పడాన్ని నిరసిస్తూ మంగళవారం నల్లగొండలో బీఆర్ఎస్ తలపెట్టిన బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మద్దూరు, ధూళిమిట్ట మండలాల అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరిలు కోరారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, హామీలు అమలు చేయడం చేతకాక బీఆర్ఎస్‌పై చిల్లరమల్లర విమర్శలు చేస్తున్నదని ఆరోపించారు. సమస్యలపై బీఆర్ఎస్ ఉద్యమిస్తుందన్నారు. నల్లగొండ సభకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమన్వయంతో పనిచేయాలి

బీఆర్ఎస్ హుస్నాబాద్ పట్టణ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్, ఫిబ్రవరి 12: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన పట్టణ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గెలిచినా, ఓడినా కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా వారి వెంటే నిరంతరం ఉంటానని, ఓడిపోయామని ఎప్పుడు కూడా అధైర్యపడొద్దన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. హుస్నాబాద్ పట్టణంలో జరిగిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. మూడు సార్లు జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయంటే అది కేవలం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కేసీఆర్ ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన మాజీ ఎంపీ బోయిన పల్లి వినోద్‌కుమార్‌ను మళ్లీ ఎంపీగా అధిక మెజార్టీతో గెలిపించుకోవడంలో హుస్నాబాద్ పట్టణ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనితారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్టి గోపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రయ్య, నాయకులు బండి పుష్ప, సుధాకర్, లక్ష్మీనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పట్టణ కార్యకర్తలు పాల్గొన్నారు.

హుస్నాబాద్ : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

మృతుల కుటుంబాలకు పరామర్శ..

అక్కన్నపేట, ఫిబ్రవరి 12: మండలంలోని గౌరవెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురాములు తండ్రి వెంకటయ్య(55) ఆదివారం హఠాన్మరణం పొందారు. సోమవారం బాధిత కుటుంబాన్ని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, ఆయన తనయుడు యువ నేత వొడితెల ఇంద్రనీల్‌బాబు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, పలు పార్టీల నాయకులు, మాజీ సర్పంచులు, నాయకులు పరశురాములును పరామర్శించారు.

గజ్వేల్ అర్బన్..

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 12: మున్సిపాలిటీలోని 8వ వార్డుకు చెందిన కొలిచెలిమి నాగరాజు సోమవారం కోమటిబండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నాగరాజుకు ప్రమాదబీమా నుంచి రూ.2 లక్షల అందిస్తామని భరోసా ఇచ్చారు.

ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 12: జిల్లా ఉన్నతాధికారులు నేరుగా ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికి మొదలుపెట్టిన గొప్ప కార్యక్రమం ప్రజావాణి అని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అర్జీదారుల నుంచి ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు నేరుగా విన్నవించి పరిష్కరించుకోవడానికి అర్జీదారులు ఎంతో ఆశతో కార్యాలయానికి వస్తారని.. వారందరికీ న్యాయం చేయడం అధికారులు గా మన కర్తవ్యం అన్నారు. అర్జీదారుల నుంచి తీసుకున్న ఫిర్యాదులు త్వరగా పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. ప్రజలకు ప్రజావాణిపై నమ్మకం పెరిగిందని, క్రమక్రమంగా అర్జీదారుల సంఖ్య పెరుగుతుండడంతో అధికారులు ఉత్సాహంతో పని చేయాలన్నారు. వివిధ సమస్యలపై మొత్తం 23 దరఖాస్తులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ నాగరాజమ్మ, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

ఈవీఎంల చెకింగ్ పకడ్బందీగా జరపాలి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 12: భారత ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ ఈవీఎం యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ పకడ్బందీగా జరపాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌లో జరుగుతున్న ఈవీఎం యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ పనులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోడౌన్ చుట్టూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం యంత్రాలను ఫస్ట్ లెవెల్ చెకింగ్‌ను పకడ్బందీగా జరపాలని 13 మంది టెక్నికల్ ఇంజినీర్లకు కోరారు.

స్పెషల్ డ్రైవ్ పరిశీలన

మర్కూక్, ఫిబ్రవరి 12 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సోమవారం అంగడికిష్టాపూర్‌లో పర్యటించారు. వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాన్ని, గ్రామంలో నిర్వహిస్తున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను పరిశీలించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా యూకేజీ విద్యార్థులు రాష్ట్రాలు, వాటి రాజధానులు, ముఖ్యమంత్రుల పేర్లను చెబుతూ శభాష్ అనిపించుకున్నారు. కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో కౌసల్యాదేవి, డీఎల్‌పీవో వేదవతి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీవో రాజలింగం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓంకార్, రామకృష్ణారెడ్డి, హరిక, చిన్ని కృష్ణ పాల్గొన్నారు.

భగవన్నామస్మరణతో కష్టాలు దూరం

- త్రిదండి చినజీయర్ స్వామి
- ఎల్కంటిలో పద్మనాభస్వామి ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

రాయపోల్, ఫిబ్రవరి 12: భగవన్నామస్మరణతో కష్టాలు దూరమవుతాయని త్రిదండి చినజీయర్‌స్వామి అన్నారు. రాయపోల్ మండలంలోని ఎల్కంటి గ్రామంలో మూడు రోజులుగా అనంతపద్మనాభస్వామి ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలు జరుగుతున్నాయి. చివరి రోజు సోమవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనకు చినజీయర్ స్వామి హాజరయ్యారు. ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం క్రేన్ సహాయంతో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చినజీయర్ స్వామి మాట్లాడుతూ ప్రతివ్యక్తి ఆధ్యాత్మిక చింతనలో ఉండాలన్నారు. ఆలయంలో నిత్యపూజలు చేసుకోవాలని, రోజుకు ఐదుగురు చొప్పున ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. చిన్న గ్రామమైనా ప్రజల్లో భక్తిభావం ఉన్నదన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో వ్యవస్థాపకుడు అట్ల రామాకృష్ణారెడ్డి, ఆయుష్ రాష్ట్ర మాజీ కమిషనర్ అట్ల రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ పిట్ల వెంకటయ్య, జడ్పీటీసీ యాదగిరి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యామలాకుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న త్రిదండి చినజీయర్‌స్వామి

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

చేర్యాల, ఫిబ్రవరి 12: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ తెలిపారు. పట్టణంలో సోమవారం సమ్మెకు సంబంధిన కరపత్రాలను పౌర సరఫరాల గిడ్డంగుల వద్ద హమాలీలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేండ్లు గడుస్తున్నా కార్మికులు, రైతులు, కూలీలు, ప్రజల సమస్యలను పట్టించుకున్న పాపానపోలేదని ఆరోపించారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌గా చేసి కార్మికులను బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాళ్లబండి భాస్కర్, కార్మికులు కనకయ్య, చంద్రం, బాబు, రమేశ్, అనిల్‌కుమార్, పోచయ్య తదితరులున్నారు.

సీఎస్సీ కేంద్రాలను ప్రారంభించాలి

ములుగు, ఫిబ్రవరి 12: పీఏసీఎస్ కార్యాలయాల్లో సీఎస్సీ(కామన్ సర్వీస్ సెంటర్) కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు 'ఈ-గవర్నెన్స్'సేవలు అందించాలని సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రఘోత్తమ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం ములుగులోని పీఏసీఎస్ కార్యాలయ భవన మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు అతితక్కువ ధరలకే ఈ గవర్నెన్స్ సేవలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అందించాలన్నారు. మండలంలో ఎరువుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలని సూచించారు. ఆయన వెంట పీఏసీఎస్ కార్యదర్శులు జితేందర్‌రెడ్డి, రమేశ్‌బాబు ఉన్నారు.

పీఏసీఎస్ కార్యాలయ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న రఘోత్తమ్‌రెడ్డి

సాగునీటిని విడుదల చేయాలి

అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నంగునూరు, ఫిబ్రవరి 12: రంగనాయకసాగర్ రిజర్వాయర్ కుడి కాల్వ నుంచి నీటిని విడుదల చేయాలని మండల పరిధిలోని అక్కెనపల్లి రైతులు సాగునీటి శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం నీటి పారుదల శాఖ కార్యాలయంలో డీఈ చంద్ర శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాగులు, చెక్ డ్యామ్‌లు, బావులు అడుగంటిపోవడంతో పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని.. నీటిని విడుదల చేస్తే చెక్ డ్యామ్‌లకు నీళ్లు వచ్చి పొలాలు పారే అవకాశం ఉంటుందన్నారు. అధికారులు నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు సుధాకర్, సత్యనారాయణరెడ్డి, రాజేశ్వర్, వెంకట్రామిరెడ్డి, చంద్రమౌళి, యాదగిరి, సదానందం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చాకలికుంట కబ్జాకు అడ్డుకట్ట

కొండపాక, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో చాకలికుంట కట్టను కబ్జా చేస్తున్నారన్న రైతుల ఫిర్యాదుకు రెవెన్యూ అధికారులు స్పందించారు. సోమవారం నక్షను పునరుద్ధరించారు. రైతుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ శ్రీనివాస్ రెవెన్యూ అధికారులను సమస్య పరిష్కరించాలని ఆదేశించగా అధికారులు చాకలికుంట కట్ట ప్రాంతాన్ని సర్వే చేశారు. ఆర్ఐ బాలకృష్ణ, మండల సర్వేయర్ శేఖర్, సిబ్బంది కబ్జాకు గురవుతున్న భూమికి కొలతలు వేశారు. ఏండ్లుగా వాడకంలో లేక, కబ్జాకు గురైన నక్షబాట కోసం సర్వే చేసి మార్కింగ్ చేశారు. తమ సమస్యను కొండపాక తహసీల్దార్ చల్లా శ్రీనివాస్ త్వరగా పరిష్కరించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. జేసీబీ సహాయంతో మార్గాన్ని చదును చేస్తున్నారు.

'దళితబంధు' విడుదల చేయాలి

బెజ్జంకి, ఫిబ్రవరి 12: అర్హులకు దళితబంధు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను హైదరాబాద్‌లో కలిసి సోమవారం వినతిపత్రం అందించినట్లు సాధన సమితి సభ్యులు ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి దళితుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు శ్రీనివాస్, బాల నర్సు, రాజేశం, తిరుపతి, పరశురాములు ఉన్నారు.

హోంగార్డుకు ఆర్థికసాయం

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 12: గజ్వేల్ పట్టణంలోని ఫైర్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న యాదగిరి అనారోగ్యంతో బాధపడు తూ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక జిల్లా సహాయాధికారి సురేశ్, సిబ్బందితో కలిసి వైద్యఖర్చుల కోసం రూ.50 వేలు అందజేశారు.

రాష్ట్ర కార్యదర్శిగా కాంతికృష్ణ

చేర్యాల, ఫిబ్రవరి 12 : ఉదయ సాహితీ(సాహిత్య వికాస వేదిక) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణను ఆ సంస్థ గౌరవ అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కవి, ఉపాధ్యాయుడు, విమర్శకుడు, బాలసాహితీవేత్తగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన కాంతికృష్ణ రాష్ట్ర కార్యదర్శిగా నియామకం కావడంతో చేర్యాలకు చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

గ్యాస్ వినియోగదారుల నంబర్ల నమోదు పూర్తి

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 12: హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో తెల్ల రేషన్ కార్డు కలిగిన గ్యాస్ వినియోగదారుల నంబర్ల నమోదును పూర్తి చేసినట్లు మున్సిపల్ ఇన్‌చార్జి మేనేజర్ కృష్ణ సోమవారం తెలిపారు. 2,307 మంది గ్యాస్ వినియోగదారులు అభయహస్తం దరఖాస్తులో నం బర్ నమోదు చేయకపోవడంతో అధికారులు రీ సర్వే నిర్వహించారు. అధికారులు ఇంటింటికీ వెళ్లి గ్యాస్ వినియోగదారుల నంబర్లు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ఇన్‌చార్జి మేనేజర్ కృష్ణ తెలిపారు.

విద్యార్థులకు అల్పాహారం

హుస్నాబాద్, ఫిబ్రవరి 12: వాసవీక్లబ్ హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం సాయంత్రం అల్పాహారం అందజేశారు. పాఠశాల సమయం అయిపోయాక సాయంత్రం 5.45 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, వాసవీక్లబ్ వారు అందించే అల్పాహారం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని హెచ్ఎం వాసుదేవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు సంపత్‌కుమార్, వనిత క్లబ్ అధ్యక్షురాలు కవిత, ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదింటి పెండ్లికి సాయం

గజ్వేల్‌అర్బన్, ఫిబ్రవరి 12: మున్సిపాలిటీలోని 10వ వార్డుకు చెందిన కుమారిబాయి కూతురు వివాహానికి సోమవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ అధ్యక్షుడు నేతి శ్రీనివాస్‌గుప్తా రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కౌన్సిలర్ రహీం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోళిసంతోష్‌కుమార్, దొంతుల సత్యనారాయణ పాల్గొన్నారు.

పునఃప్రతిష్ఠాపనకు తరలిరావాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 12: సిద్దిపేట వేంకటేశ్వర ఆలయం ఎదుట హిందూవాహిని ఆధ్వర్యంలో ఈనెల 19న ఛత్రపతి శివాజీ విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు హిందూవాహిని సంయోజక్ బసవరాజ్ సత్యం తెలిపారు.

సిద్దిపేట మెయిన్ బ్రాంచ్

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

దిగువ **రుణగ్రహీతలు మరియు హామీదారుల** నుండి సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు బకాయి **రూ. 10,23,649.00 (01-06-2023 వరకు విధించబడిన వడ్డీ)** + వడ్డీ+ ఇతర ఛార్జీలను రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/చార్జ్ చేయబడిన, రీజినల్ ఆఫీస్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే **లాంఛనప్రాయ స్వాధీనం** చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "ఏది ఉంటే అది" మరియు "అక్కడ ఏమున్నదో అదే"** ప్రాతిపదికన **14-03-2024**న విక్రయించబడుతుందని ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఆస్తి రిజర్వు ధర: **రూ. 31,18,650/-** మరియు బయానా:**రూ. 3,11,865/-. రుణగ్రహీతలు: 1. శ్రీ ఎండి. అబ్దుల్ జబ్బార్ తండ్రి బాపు